# కన్నెరికం

రాధా, రమణీ ఒకే తల్లి పిల్లలే అయినా ఇద్దరిలో అంత తేడా ఎందుకో? రాధ కంఠంలో కోయిలలు పలుకుతాయి. కాని అదేం ఖర్మో ఆ కోయిలలే తమ కంఠంతోపాటు నీల వర్ణాన్ని కూడా ప్రసాదించాయి. మరి రమణి? అంత తెల్లగా మరీ తెల్లగా ఎలా పుట్టిందో అర్థం కాదు. అయినా రమణి కంటికి రాధక్క అందంగానే కనిపిస్తుంది. బిందూ మాస్టర్ దృష్టిలో కూడా అంతేనేమో! బిందూ మాస్టర్ రాధకు శాస్త్రీయ సంగీతం నేర్పించే పంతులు. సన్నగా, పొడుగ్గా, ఉంగరాల జుత్తుతో చూడ ముచ్చటగా ఉంటాడు. రాధ ఆలాపనకి మంత్రముగ్ధుడై నాగుబాములా వూగి పోతాడు. అతని కళ్ళల్లో ఆరాధన కొట్టవచ్చినట్టుగా ఉంటుంది. ఇద్దరూ కలసి పాడుతూంటే తేనెలూరుతాయి. తమను తాము మరిచిపోయి వింటూ కూర్చుంటుంది రమణి.

రాధ కంఠ మాధుర్యాన్నుంచి బంగారం పండించాలని తాపత్రయ పడింది తల్లి. అందుకే రాధకు ఇంకా పదహారేళ్ళు నిండకుండానే ముజ్రాలకు ( పాట కచేరీలకి ) కూచోబెట్టింది. ముజ్రాలు చెయ్యటం రాధకుగానీ బిందూ మాస్టరుకు గానీ ఇష్టంలేదు. "ముజ్రాలొద్దు, శాస్త్రీయ సంగీతంలో దేశంలో కల్లా గొప్ప గాయకురాలిని చేస్తా" ననే వాడు బిందూ మాస్టర్. తల్లికి అది నచ్చలేదు. తమ కుల వృత్తి ప్రకారం ముజ్రాలు చెయ్య వలసిందేనని ఖచ్చితంగా చెప్పింది. తాను కేవలం శాస్త్రీయ సంగీతం మాస్టర్ గానే ఉండాలనీ, ఇతర విషయాల్లో జోక్యం కలుగజేసుకో వద్దనీ బిందూ మాస్టర్ని హెచ్చరించింది. ఇంకా గట్టిగా చెబితే ఎక్కడ మానిపించేస్తుందేమోనని తగ్గాడు బిందూ మాస్టర్.

ముజ్రాలో రాధ ప్రక్కన రమణిని కూచో బెట్టేది తల్లి. ఆ వచ్చే ఆరాధకులు రాధ పాటను ఎంత ఆస్వాదించేవారో ఏమో గానీ, రమణిని

మాత్రం మింగేసేలా చూస్తూంటే వంటి మీద జెర్రులు పారినట్టుగా ఉండేది రమణికి. వాళ్ళు విసిరే రూపాయలూ, నోట్లూ తనవేపే ఎక్కువగా పడేవి. తల్లి ఆజ్ఞ ప్రకారం మాట్లాడకుండా వాటి నన్నిటినీ ఏరుకుంటూ, సలాములు చేస్తూ కూచునేది రమణి.

తల్లి అంతటితో ఆగలేదు. రాధ కన్నెరికం చేయించాలని ఆత్ర పడ్డది. అదంటే ఏమిటో రాధకు బాగా తెలుసేమో. ఒక్కటే శోకాలు ఆరంభించింది. బిందూ మాస్టర్ మోహం కళా విహీనమై పోయింది. దిగులుగా, ఏదో పెద్ద ఆపదకు లోను కానున్నట్టుగా కనిపించేవాడు. తల్లి ఇవన్నీ ఖాతర్ చేసే స్థితిలో లేదు. తన వేటలో తాను మునిగి ఉంది. కాని చానాళ్ళవరకు ఆమె ఆశించినంత ధర పలికేవాడు ఎవడూ ముందుకు రాలేదు. ఆఖరికి ఒక ఖోజా సేఠ్ వెయ్యి రూపాయలకు ఒప్పుకున్నాడు. అంతకే సంతోషించింది. బ్రాహ్మణ్ణి పిలిపించి ముహూర్తం పెట్టించింది. స్వయంగా వెళ్ళి బంధువులందరినీ ఆహ్వానించి వచ్చింది. ఇంటికి సున్నాలు రంగులూవేయించింది.

రాధ దుఃఖం రానురాను ఎక్కువే అయింది. రమణి ఓదార్చాలని ప్రయత్నం చేసింది. కాని లాభం లేకపోయింది. తనని చూడగానే కావలించుకుని బావురుమనేది. ఏం చేయాలో తోచక తానూ అక్కతో శ్రుతి కలిపేది. అది వినగానే తల్లి వచ్చి గట్టిగా కేవాట్లు వేసేది. ఒకసారి రమణిని నాలుగు బాది, మళ్ళీ అక్క గదిలోకి వెళ్ళవద్దని శాసించింది. అలాగే ఒక వారం రోజులు రావద్దని బిందూ మాస్టర్‌ను కూడా ఆజ్ఞాపించింది.

ముహూర్తం రోజు రానే వచ్చింది. దగ్గరి బంధువులు అంతా వచ్చేశారు. వంటవాళ్ళు వంట లారంభించారు. మధ్యాహ్నం రాధను కూచోబెట్టి సత్యనారాయణ వ్రతం చేయించారు. సాయంత్రానికల్లా తక్కిన బంధువులంతా ఒక్కొక్కరే వచ్చేశారు. రంగు రంగుల దుస్తుల్లోనూ, అలంకారాల్లోనూ ఆడవాళ్ళు, పిల్లలతో ఇల్లంతా కళకళలాడి పోతుంది. రాధ గది అందంగా అలంకరించారు. రాధను పెళ్ళికూతురులా ముస్తాబుచేశారు. ఆమె

చేత అందరికి పసుపు కుంకుమ ఇప్పించారు. తల్లి, రమణి సహాయపడ్డారు. రాధను దేవుడి పటంముందు కూచోబెట్టి, బంధువుల్లోని ఒక పండు ముసలామె చేత రాధ మెళ్ళో మంగళ సూత్రం కట్టించారు. అందరూ అక్షింతలు జల్లి ఆశీర్వదించారు. రాధ ఏకధారగా కంటనీరు కారుస్తూనే వీటన్నిటికీ తలొగ్గింది.

ఆ తర్వాత భోజనాలు ప్రారంభమైనాయి. కొందరు యువతులు ఢోలక్ మద్దెల ముందేసుకుని పాటలు మొదలెట్టారు. అంతా గందరగోళంగా ఉంది. భోజనాలు ముగిసే సరికి పది దాటింది.

అప్పుడే ఇంటి ముందు ఒకకారు వచ్చి ఆగింది. అందులోనుంచి ఖోజా సేఠ్ దిగాడు. తల్లి పరుగు పరుగున వెళ్ళి ఆహ్వానించింది. తెల్లపైజామా సిల్కు షర్టూ, సిల్కుకోటూ, తలపైన నల్లటోపి, తెల్లగా లావుగా ఉన్నాడు. బాణలి లాంటి పొట్టను చూడగానే నవ్వొచ్చింది రమణికి. ఆడంగులందరూ, ముసి ముసి నవ్వులతో ఆదాబ్ సేఠ్, ఆదాబ్ సేఠ్, అంటూ పలకరించారు. చేతులు జోడించి ఆదాబ్ ఆదాబ్ అంటూ అటూ ఇటూ చూస్తూ తల్లి వెనకాల గదిలోకి వెళ్ళిపోయాడు.

అందరూ రాధ కోసం వెళ్ళారు. కాని రాధ కనిపించలేదు. ఇల్లంతా వెతికారు. ఎక్కడా కనిపించలేదు. ఎవరో వెళ్ళి తల్లికి చెప్పారు. ఆమె పరుగెత్తు కొచ్చింది. ఇల్లంతా మళ్ళీ మళ్ళీ వెతికారు. లాభం లేకపోయింది. ఇంటి ముందరి కాపలా కాచే మస్తాన్‌ని పంపించింది తల్లి వెతికిరమ్మని. రమణిని ఎన్నో విధాల అడిగింది. తన కేమీ తెలియదంది. ఉక్రోషం కొద్దీ నాలుగు చరిచింది తల్లి. ఏడుపు లంఘించుకుంది. అంతా గగ్గోలుగా తయారైంది.

ఇంతలో గదిలో నుంచి బయటకు వచ్చాడు సేఠ్,

"క్యాబాత్ హై ?" అన్నాడు.

అందరూ ఎక్కడి వారక్కడ గమ్మని నిలుచున్నారు. అమ్మ మొహంలో నెత్తురు చుక్కలేదు. కంటి వెంట నీరు కారుతూంది, తల దించేసుకుంది.

"క్యా బాత్ హై ?" మళ్ళీ రెట్టించాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు. తాళికట్టిన ముసలామె దగ్గర కెళ్ళి మెల్లిగా చెప్పింది, ''సేఠ్‌జీ! అమ్మాయి కనిపించడం లేదు.''

"ఏ అమ్మాయి ?"

"అదే, మీకు కాబోయే దాసి."

''అచ్చా ? '' అని భృకుటి ముడిచి, కొద్ది క్షణాలు అలానే నిలుచుని, ఎటూ చూడకుండా గబగబా కారులో వెళ్ళి కూచున్నాడు. కారు కదిలింది.

అందరూ ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు. వెయ్యి రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చిన పెద్ద మనిషి అలా చడీ చప్పుడు లేకుండా వెళ్ళిపోవడం వింతగా తోచింది. ఎవరికి తోచిన రీతిని వారు అతని గొప్పతనాన్ని పొగడటం మొదలెట్టారు. తల్లి నట్టింట కూలబడి రొమ్ము బాదుకుంటూ పెద్దగా రాగాలు తీసింది. అందరూ ఓదార్చటానికి ప్రయత్నం చేశారు. ఏవేవో సలహాలు ఇచ్చారు. పోలీసు రిపోర్టు ఇవ్వాలా వద్దా అన్నా మీద తర్జన భర్జనలు జరిగాయి.

ఒక గంట తర్వాత మస్తాన్ తిరిగొచ్చాడు. రాధ ఎక్కడా కనిపించలేదనీ, బిందూ మాస్టర్ కూడా ఇంట్లో లేడనీ చెప్పాడు. అందరి ధ్యాస బిందూ మాస్టర్ మీదే పోయింది. అతని మీదే అనుమానం కేంద్రీకరించింది. ఇక లాభంలేదు. పోలీసులకి రిపోర్టు ఇవ్వవలసిందేనని నిశ్చయించారు. వెంటనే మస్తాన్‌ను వెంట బెట్టుకుని తల్లీ ఇంకో ఇద్దరూ వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు రాయించి వచ్చారు.

రెండు గంటల క్రితం వరకు శోభయమానంగా వెలిగిపోతున్న ఇల్లంతా శోక మందిరంగా మారిపోయింది. రమణి ఒక మూలకు కూచుని, అక్కను తలచుకుని, దుఃఖిస్తోంది రమణి. 'అక్కకు ఏ ఆపదా రాకుండా చల్లగా కాపాడు భగవాన్ !' అనుకుంటూ లోలోనే భగవంతుని ప్రార్థిస్తోంది.

## కన్నెరికం

రాత్రి రెండు గంటలు దాటింది. స్టేషన్‌లో పచార్లు చేస్తున్నాడు, ఎస్. ఐ. ఇబ్రాహీం, దీర్ఘాలోచనలో మునిగిపోయి. బైట వరండాలో ఒక కానిస్టేబిల్ బెంచీ మీద కూచుని కునికిపాట్లు పడుతూ ఉన్నాడు.

ఆ రిపోర్టు వచ్చినప్పటి నుంచి ఎస్ ఐ. కి మనసంతా అస్తవ్యస్తంగా ఉంది. తాను ఎన్నోసార్లు ఎన్నో 'కోఠా' లు ఎక్కాడు: ముజ్రాలో కూచున్నాడు: పాటవిన్నాడు; రూపాయలువెదజల్లాడు. ఒక్కొక్కచోటఒక్కొక్కసారి ముజ్రా అయిపోయి అందరూ వెళ్ళిపోయాక, 'నాయికా, (వేశ్యమాత) సీసా తెచ్చి ముందర పెడుతుంది. తాను కోరిన అమ్మాయిని తెచ్చి ఒళ్ళో పడేస్తుంది. రాత్రంతా ఆనందంగా గడిపి తెల్లవారేసరికి స్టేషన్ చేరుకుంటాడు అప్పుడప్పుడు గలాటా అవుతూ ఉంటాయి. తాగి వచ్చిన విటులు కొట్లాటలకు దిగుతూంటారు తాను వెళ్ళి చితకబాది స్టేషన్‌లో తెల్లవార్లు కూచోబెట్టి, కేసు పెడతానని బెదిరించి వాళ్ళ దగ్గర వీలయినంత వసూలు చేస్తుంటాడు, లైసెన్సులేని వేశ్యాగృహాలపైన దాడులు కూడా జరుపుతూంటాడు. గదుల్లో ఇరుక్కున్న విటుల్ని, భోగం వాళ్ళనీ బైటికి లాగి తన్ని వాన్‌లో పడేసి స్టేషనుకు తరిమి ఆ తర్వాత రెండు చేపులా దాగా లాగి వదిలేసి,ఏమీ ఇవ్వలేని బికారి కేసులను రెండు మూడింటిని రెండో రోజు కోర్టులో హాజరు పరచి జుల్మానాలు వేయిస్తుంటాడు,

కాని . కాని... కన్నెరికం ? అదేదో తన అనుభవంలోకి అంత వరకు రాలేదు, భోగం వాళ్ళు తమ కూతుళ్ళచేత కొత్తగా 'వ్యాపారం' మొదలు పెట్టించే ముందు కన్నెరికం చేయిస్తారని తెలుసు. పెద్ద ఆర్భాటాలు కూడా చేస్తారని విన్నాడు. తన దాహావులల్లో ఎందరో నలిగిపోయారు. కాని ఒక్క దాన్ని కన్యగా అనుభవించిన అదృష్టం తనకు ఇంతవరకూ కలగలేదు. అదేలా ఉంటుందో ?

చప్పున తన పెళ్ళి రాత్రి జరిగిన 'కార్యం' గుర్తుకొచ్చింది. అవును, అది కూడా కన్నెరికంలాంటిదే కదూ ? ఎప్పుడో, ఏనాడో కలగా

జ్ఞాపకముంది. అప్పటికి తనకు ఇరవై ఏళ్ళు, షకీలా కింకా పదిహేను కూడా నిండలేదు. ఇద్దర్నీ గదిలోకి తరిమి తలుపులు బిగించారు. మిఠాయి తిని, పాలు తాగిన గుర్తుంది. ఆ తర్వాత ఏం చేయాలో తనకు సరిగా తెలియదు షకీలాకు అంతకన్నా తెలియదు. ఆ రాత్రి ఎలా గడిచిందో అంతా కలగానే ఉండిపోయింది. ఆనాటి ముగ్ధ షకీలా ఈనాడు హవ్వా (ఆదినారి) గా మారింది. ఇంకా ముప్పై ఏళ్ళు నిండకుండానే అయిదుగురు పిల్లలని కనేసి, రోడ్డు రోలరులా తయారయింది. ఎప్పుడూ 'డబ్బా, డబ్బా' అంటూ తన ప్రాణాలు తోడేస్తూంటుంది కాని వంటి మీద చెయ్యి వెయ్యనివ్వదు. ప్చ్ ! ఏం బ్రతుకో !

అందుకేనేమో డబ్బున్న ఆసాములు కన్నెరికాల కోసం ఎగబడతారు. ఒక్క రాత్రికోసం వందలూ, వేలూ ఇస్తారట. ఆ ఖోజా సేఠ్ ఎవడో వెయ్యి ఇచ్చాట్ట. దొంగముండా కొడుకు దగ్గర బాగానల్లడబ్బు ఉండి ఉంటుంది. అలాంటి కన్నెరికం జరిగేచోట ఒక మాటురెయిడ్‌చేస్తే బావుండును. వాణ్ణి నాలుగు తన్ని, జేబులు ఖాళీచేసి, బయటకు తగలేసి ఆ కన్నెరికం తానే జరిపిస్తే ఎంత బావుంటుందో అనుకుని ఉవ్విళ్ళూరాడు ఎస్.ఐ.

ఇంతలో బీట్ జవాన్ ఒకడు వగరుస్తూ లోపలి కొచ్చాడు. సెల్యూట్ చేసి, "సార్ ! సార్ ! దొరికిన్రు" అన్నాడు.

ఎస్. ఐ. కలల ప్రపంచంలో నుంచి బయట పడ్డాడు.

"ఎవరు ? ఎవర్రా దొరికింది " అన్నాడు.

"అల్లె సార్ ! ఇందన్కు ఆ దొంగమోల్లొచ్చి రిపోర్టుయ్యలే, అల్లె... బద్మాష్‌గాల్లు, ఒప్పుకోటంలే. రిక్షాల కూకుని ఫరారౌతుంటే నేనూ, ఫోర్టీంటి పట్టుకున్నము."

ఎస్. ఐ. కళ్ళు మెరిశాయి. "ఊఁ, తెండి లోపలికి, నే నొప్పిస్తా" అన్నాడు.

జవాన్ పరుగెత్తాడు. వరండాలో ఉన్న కానిస్టేబిల్ కూడా హుషా రుగా లేచి నిలుచున్నాడు.

ఎస్. ఐ. దర్జాగా కుర్చీలో కూర్చుని మీసాలు మెలేస్తున్నాడు. బీట్ జవాన్లిద్దరూ చెరోకరిని పట్టుకుని వచ్చారు లోపలికి. బెరుకు బెరుకుగా వచ్చారు రాధా బిందూమాస్టర్. రాధ చేతిలో ఒక చిన్న సూట్‌కేస్ ఉంది.

వాళ్ళను ఎగాదిగా చూసి గద్దించాడు ఎస్. ఐ. "ఎవరు మీరు ?"

"మేము .... మేము భార్యాభర్తలం సార్ !" అన్నాడు బిందు కొంచం ధైర్యంగానే.

"అహ హహ !" పెద్దగా నవ్వాడు ఎస్.ఐ. "భార్యాభర్తలు! .. హుఁ, మీ కప్పుడే పెళ్ళి కూడా అయింది. ? ఇప్పుడు చేస్తాను మీ పెళ్ళి— ఇక్కడ స్టేషనో చేస్తాను "

'అయింది సాబ్ ! నిజంగా. ఇదిగో పుస్తె తాడు" అంటూ మెడలోని మంగళసూత్రం చూపించింది రాధ.

మంగళసూత్రం ఒక క్షణం జంకాడుఎస్. ఐ. వెంటనే సొరుగు లోంచి ఇందాకటి రిపోర్టు తీసి చూశాడు. దాని కో ఫొటోకూడా తగిలించి ఉంది. ఒకటి రెండుసార్లు ఫోటోకేసీ, రాధ కేసీ మార్చి మార్చి చూసి చిరు నవ్వుతో లేచి నిలుచున్నాడు.

"మీ పేర్లేవిటీ ?"

ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"నా పేరు కృష్ణారావు ఈమె పేరు . "

వాక్యం పూర్తి కాలేదు. ఫడేల్ మని చెంప దెబ్బ పడ్డది. "బద్మాష్. నాకే టోకరా ఇవ్వాలనుకున్నావురా ? నీ పేరు బిందూ కాదూ?... ఊఁ చెప్పు" అంటూ. రెండో చెంప వాయించాడు. ఆ దెబ్బతో బిందూ నోట్లోంచి

నెత్తురు కారటం మొదలెట్టింది. అది చూసి రాధ "అయ్యో, అయ్యో" అంటూ పెద్దగా ఏడవటం మొదలెట్టిది.

"చుప్ "హరాంజాదీ" నోర్ముయ్" అంటూ తల మీద ఒక్కటి అంటించాడు. నోట్లో కొంగు కుక్కుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంది.

"చెప్పు నీ పేరేమిటి ? అంటూ పైపైకి వెళ్ళాడు.

భయంతో వెనక్కి తగ్గుతూ "కొట్టకు—కొట్టకన్నా. నిజం చెబుతా" అంది రాధ.

ఏమిటీ? అన్నా అహ్హాహ్హా. నేను అన్ననా ? మీకు అన్నగాళ్ళు కూడా ఉంటారా ? అందరూ ముండగాళ్ళు కాదూ ? రే ఆ సూట్ కేస్ ఇటివ్వు—ఎంత దొంగిలించు కెళుతున్నారో చూస్తా . . .?"

"ఏం లేదు ? ఇందులో ఏం లేదు" అంటూ ఇంకా వెనక్కి జరగ బోయింది రాధ.

"ఊఁ తెమ్మందే..." అంటూ గుప్పురమి చేతిలోంచి సూట్ కేసు లాక్కొని టేబిల్ మైన పెట్టాడు ఎస్. ఐ. "తే, తిన్నగా తాళం చెవులివ్వు, లేకుంటే చంపేస్తా. ఏమనుకున్నావో."

భయం భయంగా తాళం చెవి తీసిచ్చింది.

సూట్ కేస్ తెరిచిచూశాడు. అన్నీ గుడ్డలే ఉన్నాయి. నగలేమీ లేవు. అట్టడుగున కాగితం కింద నోట్లకట్ట ఒకటుంది. అది కనపడగానే ఎస్. ఐ. ముఖం వికసించింది. దాన్ని కాస్తా పాంటు జేబులో కుక్కుకున్నాడు.

బింధుమాస్టర్‌లో ఒక్కసారి చలనం కలిగింది.

"ఇన్స్‌పెక్టర్‌సాబ్, అన్యాయం-అది నా కష్టార్జితం-మేము బతకాలి" అన్నాడు.

"చుప్‌బే" అంటూ ఒక గుద్దు గుద్దాడు. "ఓరేయ్ ఖోట్వాలీ వాడి నోట్లో గుడ్డలుకుక్కి చేతులు కట్టేయ్"

అలానే చేశారు.

''ఏరా ! ఈ గుంటను ఎగిరేసుకు పోదామనుకున్నావా ? ఏడేళ్ళు జైల్లో కూచో పెడతాను, జాగర్త".

రాధ వైపు తిరిగి "ఏమే, ఎక్కడికి ఉడాయిద్దామనుకున్నారు ?" అన్నాడు.

రాధ మాట్లాడలేదు.

"ఊఁ, చెప్పు" అని మళ్ళీ గద్దించాడు.

"ఇంకో వూళ్ళో బతుకుదామనుకున్నాం..."

"మరి వాడు.ఆ సేఠ్‌గాడిచ్చిన రూపాయల మాటో?"

"అవి... అవి నేను తీసుకోలేదు... అమ్మకు తెలుసు".

"ఓహో, అమ్మా? అయితే అమ్మే చేసుకుంటుందా కన్నెరికం? సరే," వాడి బదులు నేను చేస్తాను నీకు కన్నెరికం"

"అన్నా" అంటూ పొద్దపెట్టున కేకపెట్టి ఎస్. ఐ. కాళ్ళు పట్టుకుంది రాధ.

''అరే, మళ్ళీ అదేమాట ?...ఒరేయ్, దీన్ని, ఆ గదిలోకి లాక్కెళ్ళండి. అక్కడే చేస్తాను కన్నెరికం".

పెద్దగా ఏడుస్తున్న రాధ నోటినొక్కి గదిలోకి లాక్కుపోయాడు ఒకడు. ఇటుబిందూ విదిలించుకుని ఎస్. ఐ. పైన పడబోయాడు. ఎస్. ఐ. బూటు కాలుతో ఒక్కతన్ను తన్నే సరికీ ''అమ్మా" అంటూ నేలకొరిగాడు.

"ఒరేయ్, వాణ్ణి లాకప్‌లో పడేయండి. గోలచేస్తే తన్నండి" అంటూ హుకుం జారీచేసి ఠీవిగా మీసాలు దువ్వుకుంటూ గదిలో అడుగు పెట్టాడు ఎస్. ఐ. తలుపులు మూసుకుపోయాయి.

బిందూను ఈడ్చుకుపోయి లాకప్‌లో పడేశారు. పక్క గదిలోంచి కేకలు వినపడ్డప్పుడల్లా లేవటానికి ప్రయత్నం చేశాడు. తన్నులూ, తిట్లూ తిన్నాడు.

ఒక గంట తరవాత ఇద్దర్నీ తీసుకెళ్ళి అదే రిక్షాలో పడేసి తరిమేశారు బీటు జవాన్లు. (ఆంధ్రప్రభ వారపత్రిక 18-1-79)